# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 1-10-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక: 49 పేజీలు:6 వెల: రూ.1/-


## రూ.2వేల నోట్ల మార్పిడికి అక్టోబర్ 7వరకు గడువు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 30:రూ. 2వేల నోట్ల మార్పీఐ కీలక ప్రకటన చేసింది. రూ. 2వేల నోట్లు మార్చుకునేందుకు విధించిన గడువు ఇవాళ్టితో ముగియనుంది. అయితే ఆ గడువును ఆర్బీఐ అక్టోబర్ 7వ తేదీవరకు పొడిగించింది. ఇప్పటి వరకు నోట్లు మార్చుకోని వారు అక్టోబర్ 7వ తేదీ వరకు రూ. 2వేల నోట్లు మార్చుకునే అవకాశం కల్పించింది. అందువల్ల ఇంకా ఎవరైనా రూ. 2 వేల నోట్లను మార్చుకోకుండా అలానే పెట్టుకొని ఉంటే.. వెంటనే త్వరపడి మార్చుకోవాలని తెలిపింది.

## తెలంగాణలో మరో మూడురోజులు వానలు..

హైదరాబాద్, సెప్టెంబర్ 30: తెలంగాణలో రాగల మూడురోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో శుక్రవారం ఏర్పడిన అల్పపీడనంగా బలపడిందని, ప్రస్తుతం వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతుందని పేర్కొంది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు వ్యాపించి ఉందని తెలిపింది. వీటి కారణంగా రాగల మూడురోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో పలు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## ప్యాడి ఫిల్లింగ్ మిషన్‌పై హనుమాజీపేట విద్యార్థికి పేటెంట్ హక్కులు

### -జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందన



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 30: హనుమాజిపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థి మరిపెల్లి అభిషేక్ తయారుచేసిన ప్యాడి ఫిల్లింగ్ మిషన్ కు భారత ప్రభుత్వంచే పేటెంట్ హక్కులు అందాయి. అభిషేక్ 2019 ఇన్స్పైర్ ఎగ్జిబిషన్లో భాగంగా ఈ ప్రాజెక్ట్ కి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు. అలాగే వరంగల్లోని మదికొండలో జరిగిన రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్లో మెరిట్ ను పొందాడు. దీనికి జాతీయస్థాయిలో ఐఐటి ఢిల్లీలో నిర్వహించిన ఎగ్జిబిషన్లో మూడవ స్థానం లభించింది. అభిషేక్ తన తండ్రి ఐకెపి సెంటర్లలో ధాన్యం నింపడాన్ని పరిశీలించి, ధాన్యాన్ని సంచులలో నింపడానికి సులువైన పద్ధతిపై ఎగ్జిబిట్ ను తయారు చేశారు. ఇందులో విజయం సాధించిన తర్వాత ఎన్ఐటి వరంగల్లో నెలరోజులపాటు రోబోటిక్స్ పై ట్రైనింగ్ తీసుకున్నాడు. గుజరాత్లోని అహ్మదాబాదులో నిర్వహించిన ఫైన్ ఫైన్ ప్రోగ్రాంలో పాల్గొన్నాడు. ఇన్స్పైర్, మొదటి రెండవ ,మూడవ స్థానం లభించిన అనంతరం రాష్ట్రపతి భవన్లో రాష్ట్రపతిని కలిశారు. ఎన్ఐఎఫ్ వారు నిర్వహించే సకూర జపాన్ ప్రోగ్రామ్కు కూడా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అభిషేక్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, డీఈవో రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ శ్రీకాంత్ రావు, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జంకెమల్లేశం, సర్పంచ్ జంకె విజయ -శ్రీనివాస్ రెడ్డి, గైడ్ టీచర్ కోరెం వెంకటేశం, ఉపాధ్యాయ బృందం, అభినందించారు.

## వ్యాయమ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

### -రాజన్నసిరిసిల్ల జిల్లా పీఈటీ శాఖ



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): వ్యాయమ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని రాజన్నసిరిసిల్ల జిల్లా పీఈటీ శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాయమ ఉపాధ్యాయుల అప్ గ్రేడేషన్ కేసులు హైకోర్టులో తుది తీర్పు వచ్చినందున, ఆ తీర్పు ప్రకారం వెంటనే వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఇప్పుడు జరుగుతున్న పదోన్నుతులలో అర్హత గల ప్రతి వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ షెడ్యూల్ లోనే ఫిజికల్ డైరెక్టర్ గా పదోన్నుతులు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దుప్పటి రవి కుమార్, ప్రధాన కార్యదర్శి నాంపెల్లి శ్రీనివాస్ లు ఉన్నారు.

### నేటి కందం- నేటికి అందం



కం॥ అర్ధమ శేతి రియ్యైనను
పాద్దుల వెరు గడి కేరళన అభిమానయ ధన్
పెద్దల డి నొప్పు వచ్చును
ముద్దుగ జరిపించు పలయు మొదమెప్పుగటిన్ !!

-రాధశ్రీ

( అక్టోబర్ 1 ప్రపంచ పెద్దల దినోత్సవం...) సెల్:9494481210

## తారక రామారావు పేరులోనే పవర్ ఉంది : మంత్రి కేటీఆర్



ఖమ్మం, సెప్టెంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ఎన్టీఆర్ ఆరాధ్య దైవమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై రూ. 1.37 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ పార్కు సహా విగ్రహాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌తో కలిసి కేటీఆర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ఎంతో అప్పుడు విశ్వ విఖ్యాత నందమూరి తారక రామారావు. ఎవరు ఎన్ని రకాల చరిత్రలు రాసినా.. కొన్ని చెరిగిపోని సత్యాలు ఉంటాయి. అందులో భారతదేశంలో తెలుగు వారున్నారని ఎలుగెత్తి, చాటిచెప్పింది నందమూరి తారకరామారావు మాత్రమే. ఈ విషయంలో ఎవరికీ రెండో అభిప్రాయం, ఆలోచన అవసరం లేదు. ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన మహా నాయకుడు ఎన్టీఆర్. రాముడు ఎలా ఉంటాడో తెలియదు.. కృష్ణుడు ఎలా ఉంటాడో తెలియదు.. మాకు రాముడైనా, కృష్ణుడైనా ఆయనే. భారతదేశంలో తెలుగు వారంటూ ఉన్నారని గుర్తించేలా చేసింది ఎన్టీఆరే. చరిత్రలో మహనీయుల స్థానం ఎప్పటికీ చిరస్మరణీయంగా ఉంటుంది. ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం తన అదృష్టమన్నారు.

తనకు తారక రామారావు పేరు ఉండటం చాలా సంతోషంగా ఉంది. తారక రామారావు పేరులోనే పవర్ ఉందన్నారు. ఎన్టీఆర్ శిష్యుడిగా కేసీఆర్ తెలంగాణ అస్తిత్వాన్ని దేశ వ్యాప్తంగా చాటి చెప్పారు. దక్షిణ భారతదేశంలో అన్న ఎన్టీఆర్ సహా ఇప్పటి వరకూ హ్యాట్రిక్ ఎవరూ కొట్టలేదు. అది సీఎం కేసీఆర్‌కు త్వరలో సాధ్యమవుతుందని మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## అర్హత గల ప్రతి రైతుకు పంట రుణం అందాలి

### -రుణమాఫీ జరిగిన రైతులందరికీ పంట రుణాలు అందించాలి- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి సెప్టెంబర్, 30 (నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో అర్హత గల ప్రతి రైతుకు పంట రుణం అందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శనివారం రుణమాఫీ, పంట రుణాల పురో గతిపై వ్యవసాయ శాఖ అధికారులు, ఎల్ డి ఎం, వివిధ బ్యాకుల కంట్రోలింగ్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రుణమాఫీ జరిగిన రైతులందరికీ వంద శాతం కొత్త పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. ప్రతి రైతుకు అర్హత మేరకు నూతన పంట రుణాలు అందించాలన్నారు. ఈ రెండు మూడు రోజుల లోగా పంట రుణాలు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు.



జిల్లాలో ఇప్పటివరకు 80,857 మంది రైతులకు 471 కోట్ల 71 లక్షల రూపాయలు రుణమాఫీ జరిగిందన్నారు. దీంట్లో70 శాతం మంది రైతులకు కొత్త రుణాలు అందించామని, మిగతా వారికి వెంటనే రుణాలు అందించాలని కోరారు. డిబిటి(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్సఫర్) ఫెయిల్యూర్ అయిన రైతుల వివరాల డాటాను ఆయా బ్యాంకర్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ కు అందించాలని ఆదేశించారు. బ్యాంకు వారీగా, బ్రాంచి వారిగా, రైతు వారీగా ఎంత మంది రైతులకు ఎంత మొత్తం రుణమాఫీ అయిందన్న వివరాలు అందించాలన్నారు.

పంట రుణాలు ఇచ్చిన రైతులందరి జాబితా, రైతుకు సంబంధించిన వివరాలు, ఎంత లోన్ ఇచ్చామన్న వివరాలను వ్యవసాయ శాఖ ఏఈఓ లకు అందించాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లతో సమన్వయం చేసుకుంటూ రుణమాఫీ జరిగిన రైతులందరికీ కొత్తగా పంట రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎల్ డి ఎం గోపాల్ రెడ్డి, వ్యవసాయ శాఖ జేడి నరసింహారావు, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటే గ్యారంటీ కాదు.. 420 పార్టీ: మంత్రి కేటీఆర్

ఖమ్మం, సెప్టెంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ అంటే గ్యారంటీ కాదని, అది 420 పార్టీ అని మంత్రి కేటీఆర్ అన్నారు. రైతును రాజుగా మార్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ ను సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాంత రైతులు ఫ్యాక్టరీని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పైకి ఎదగాలని సూచించారు. ఖమ్మం జిల్లా ప్రజలు చాలా చైతన్యవంతులని మంత్రి కేటీఆర్ అన్నారు. వారెంట్ లేని కాంగ్రెస్‌ను వచ్చే ఎన్నికల్లో అడ్రస్ లేకుండా చేయాలనని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ గెలుపు అభివృద్ధికి మలుపు కావాలన్నారు.

## సంక్షేమానికి కేరాఫ్ అయిన బీఆర్ఎస్ మీద విమర్శలు సరికాదు..

ములుగు , సెప్టెంబర్ 30: (నేటినిజం ప్రతినిధి): ఓటమి ఖరారైందని భావించి? ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క ఇష్టారీతిగా మాట్లాడుతూ.. రాజకీయ డ్రామాలు చేస్తున్నారని తెలంగాణ రెడ్కో చైర్మన్ వై సతీష్ రెడ్డి ఆరోపించారు. ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

వ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించేందుకు నియోజకవర్గాన్ని డిస్టర్బ్ చేయాలని సీతక్క చూస్తున్నారని సతీష్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రులు వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోంటే ధర్నాలు చేయించారు. సీడీపీ నిధుల పేరుతో కోర్టుకు వెళ్లారు. ఉద్దేశపూర్వకంగా రాజకీయంగా లబ్ధి పొందాలని మీరు కోర్టుకు పోయారు. ఇదంతా రాజకీయ డ్రామా. సీతక్క పబ్లిసిటీ కోసమే కోర్టుకు వెళ్లారు. నియోజకవర్గాల అభివృద్ధి నిధుల్లో ప్రభుత్వం వివక్ష చూపిస్తుందనేది పెద్ద అబద్ధం. నిబంధనల ప్రకారం గత ప్రభుత్వాల మాదిరిగానే నిధులు ఇచ్చాం. కానీ పనులు మొదలుకాకుండానే సగం నిధులు విడుదల చేయాలని అడగడాన్ని బట్టి ఆమె దురుద్దేశం అర్థమవుతోంది. లంబాడ బిడ్డ అయిన మంత్రి సత్యవతి రాథోడ్‌ను టార్గెట్ చేశారు. దురుద్దేశంతోనే కోర్టు పిటిషన్‌లో మంత్రి పేరు ప్రస్తావించారు. మరోవైపు సీతక్క కోర్టు పిటిషన్‌లో కూడా సెల్ఫ్ డబ్బా కొట్టుకున్నారు తప్పా ప్రజల పనికొచ్చే ఒక్క అంశం కూడా లేదని సతీష్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా మీరు ఉన్నా కూడా మా ప్రభుత్వం ఎక్కడా వివక్ష చూపలేదు అని సతీష్ రెడ్డి తెలిపారు. మా ఎమ్మెల్యే అభ్యర్థి ఓడిపోయినా కూడా ములుగుని జిల్లా చేసుకున్నాం. ఎవ్వరు అడగకపోయినా కూడా ములుగుని మున్సిపాలిటీ చేసుకున్నాం. మొన్నటికి మొన్న మల్లంపల్లి మండలాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నాం. తెలంగాణలో రెండు నియోజకవర్గాల్ని హెల్త్ ప్రొఫైల్‌కి సెలెక్ట్ చేస్తే అందులో ఒకటి సిరిసిల్ల అయితే రెండోది ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న ఈ ములుగు అసెంబ్లీ నియోజకవర్గం అని తెలిపారు.

## ఢిల్లీ నుంచి నైరుతీ రుతుపవనాలు తిరోగమనం: ఐఎండీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:నైరుతీ రుతుపవనాలు తిరోగమన బాట పట్టినట్లు భారతీయ వాతావరణ శాఖ తెలిపింది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి రుతుపవనాల తగ్గుముఖంపట్టాయని ఐఎండీ వెల్లడించింది. అయితే ఈ వర్షాకాల సీజన్‌లో .. ఢిల్లీలో సాధారణం కన్నా ఎక్కువ స్థాయిలోనే వర్షాలు పడినట్లు ఐఎండీ పేర్కొన్నది. ఢిల్లీలో ఉన్న వెదర్ స్టేషన్.. సఫ్దార్‌జంగ్ అబ్జర్వేటరీ ప్రకారం .. ఈసారి వర్షాకాలంలో 660.8 వర్షం నమోదు అయ్యింది. సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబర్ సీజన్‌లో 653.6 ఎంఎం ఉంటుందని ఐఎండీ తెలిపింది. ఐఎండీ ప్రకారం.. ప్రతి ఏడాది జూన్ 27వ తేదీ నుంచి ఢిల్లీలో వర్షాకాలం మొదలువుతంది. ఇక సెప్టెంబర్ 25వ తేదీ నుంచి రుతుపవనాలు వెళ్లిపోతాయి. అయితే ఈ ఏడాది జూన్ 25వ తేదీ నుంచే నగరంలో వర్షాలు పడినట్లు ఢిల్లీ వెదర్ శాఖ తెలిపింది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, వెస్ట్ యూపీ, వెస్ట్ మధ్యప్రదేశ్, ఈస్ట్ రాజస్థాన్, వెస్ట్ రాజస్థాన్ నుంచి కూడా రుతుపవనాలు తిరుగుబాట పట్టాయని ఐఎండీ ఒక ప్రకటనలో తెలిపింది.

### అక్టోబర్ 2న చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం

### -హాజరుకానున్న సినీ హోరోయిన్ కృతి శెట్టి, రాజకీయ ప్రముఖులు

కరీంనగర్, సెప్టెంబర్ 30 కరీంనగర్ పట్టణ కేంద్రంలో అక్టోబర్ 1వ తేదీన చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం జరగనుంది. ఈ షాపింగ్ మాల్ ను ప్రముఖ సినీనటి క్రితిశెట్టి ప్రారంభించనున్నారు. దీనికి రాష్ట్ర బీసీ సంక్షే సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ , కరీంనగర్ లోకృభ సభ్యులు బండి సంజయ్ కుమార్, సభ్యులు జోగినపల్లి సంతోషుమార్ , రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, పరిషత్ చైర్పర్సన్ కనుమల్ల విజయ, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ యాదగిరి సునీల్రావు , మేయర్ చల్లా స్వరూపారాణి, 43వ డివిజన్ కార్పొరేటర్ సరిళ్ల ప్రసాద్, జబర్దస్త్ టీం సభ్యులు పాల్గొన్నారు. ఉత్తర తెలంగాణకు కేంద్ర స్థానంగా ఉన్న కరీంనగర్ లో షాపింగ్ మాల్ ప్రారంభించడం సంతోషంగా భావిస్తున్నామని షాపింగ్ మాల్ నిర్వాహకులు మర్రి జనార్ధన్రెడ్డి, వెంకటరెడ్డి, మర్రి శశిధర్రెడ్డి, మర్రి జమునారెడ్డి, మర్రి మధుమతి తెలిపారు నిష్ణాతులైన డిజైనర్లతో రూపొందించిన అధునాతన డిజైన్లతో కూడిన పట్టు వస్త్రాలను సొంత మగా నిష్ణాతులైన చేనేత కార్మికులతో, నిపుణుల పర్యవేక్షణలో నేయించడం వల్ల అతితక్కువ ధరలకు మాల్ ద్వారా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

## సిద్దిపేటలో భరోసా, సఖి కేంద్రాలను ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట సెప్టెంబర్ 30 సిద్దిపేట జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన భరోసా, సఖి కేంద్రాలను రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్, ఏడీజీ శిఖా గోయల్‌తో కలసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళా సంరక్షణ కోసం సఖి, భరోసా కేంద్రాలతోపాటు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, బాల రక్ష భవన్ కేంద్రం కలిపి ఒకే చోట ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ బాధిత మహిళలకు వ్యక్తిగత గోప్యతతో పాటు కౌన్సిలింగ్, లీగల్ సపోర్టుతో కూడిన రక్షణ లభిస్తుందని మంత్రి చెప్పారు. ఇలాంటి రక్షణ వ్యవస్థ ఉందని అందరికీ తెలిసేలా చర్యలు చేపడతామన్నారు. సీఎస్ఆర్ ద్వారా 1.8 కోట్ల రూపాయలతో సఖి, భరోసా కేంద్రాలను నిర్మించిన గొప్రో పెట్రో కెమికల్ వారికి, లైబ్రరీని అందించిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ స్టూడెంట్ ఆకర్షణకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ.. సిద్దిపేటలో భరోసా, సఖి సెంటర్లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో 2014లో ప్రారంభం చేసిన ఈ సెంటర్‌లు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మహిళా భద్రత కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. ఏడీజీ శిఖా గోయల్ మాట్లాడుతూ.. రాష్ట్రం మొత్తం షీ టీమ్స్ ఏర్పాటు చేశామని చెప్పారు.

దేశం మొత్తంలో తెలంగాణలో మాత్రమే ప్రతి పోలీస్ స్టేషన్ మహిళా విభాగం కలిగి ఉన్నదని శిఖా గోయల్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం చిన్నారులు, మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించిందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి మహిళల అక్రమ రవాణాను అరికడుతున్నామని చెప్పారు.

జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ని ప్రారంభించిన హరీష్ రావు

సిద్దిపేట నంగునూరు మండలం ముండ్రాయిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ని రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్మన్ రోజా రాధాకృష్ణ శర్మ, మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాపరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అధికార లాంఛనాలతో ఎంఎస్ స్వామినాథన్ అంత్యక్రియలు పూర్తి

చెన్నై, సెప్టెంబర్ 30: హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. తమిళనాడు ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. బెసెంట్ నగర్ విద్యుత్ శ్మశాన వాటికలో ఆయన అంతిమ సంస్కారాలు జరిగాయి.

స్వామినాథన్ పార్థివ దేహం శ్మశాన వాటికకు చేరుకున్న తర్వాత పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి నివాళులు అర్పించారు. అనంతరం శంఖం పూరించారు. ఆ తర్వాత పార్థివ దేహాన్ని విద్యుత్ చితిలోకి పంపి దహనం చేశారు. కాగా, 98 ఏళ్ల స్వామినాథన్ వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో గురువారం మరణించారు.

## సికింద్రాబాద్ స్టేషన్‌లో అపహరణకు గురైన బాలుడి ఆచూకీ లభ్యం

హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సికింద్రాబాద్ స్టేషన్‌లో అపహరణకు గురైన బాలుడి ఆచూకీ లభ్యమైంది. బాలుడిని కిడ్నాపర్ మాదాపూర్‌లో వదిలేసి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. బాలుడు ప్రస్తుతం సురక్షితంగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. బాలుడిని అతని తల్లిదండ్రులకు అప్పగిస్తామన్నారు. సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా బాలుడి ఆచూకీని పోలీసులు గుర్తించారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం రాయలపురానికి చెందిన దుర్గేశ్ బధిరుడైన తన ఐదేండ్ల కుమారుడితో కలిసి తిరుపతికి వెళ్లి వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ స్టేషన్‌కు దుర్గేశ్ చేరుకున్నాడు. ఆ సమయానికి తమ గ్రామానికి బస్సులు ఉండవని చెప్పి, అలసిపోయి రైల్వేస్టేషన్‌లో ఉండిపోయాడు. తన వస్తువులను, కుమారుడిని ఒకటో నంబర్ ప్లాట్ ఫాం వద్ద ఉంచి దుర్గేశ్ శౌచలయానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి బాలుడు కనిపించలేదు. ఆందోళనకు గురైన తన కుమారుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన రైల్వే పోలీసులు.. అక్కడున్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా, గుర్తు తెలియని దంపతులు బాలుడిని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.




# నిన్నటి వీరులే నేటి వయోవృద్ధులు?!

## (01 అక్టోబర్ "అంతర్జాతీయ వయోవృద్ధుల దినం" సందర్భంగా)

మనలో కొందరు వాస్తవ వయస్సు కన్న యవ్వనంగా కనిపిస్తూ పొరుగు వారికి ఈర్ష్యాజనకంగా వెలిగి పోతుంటారు. మరి కొందరు తమ వయస్సు కన్న వృద్ధులుగా చర్మ ముడతలతో కనిపిస్తారు. 30-ఏండ్ల అసలు వయస్సు (క్రానలాజికల్ ఏజ్) ఉన్న యువకుడు ఏళ్ల తరబడి వ్యాయామం చేయకుండా, అధిక కొవ్వులు కలిగిన ఆహార పదార్థాలను తీసుకుంటూ, ఎక్కువ పొగ తాగడం, దురలవాట్లకు బానిసగా ఉన్నట్లయితే అతని జీవ సంబంధ వయస్సు (బయలాజికల్ ఏజ్) 30 ఏండ్ల కన్న చాలా అధికంగా కనిపిస్తుందని శాస్త్రపరిశోధనలు తెలుపుతున్నాయి. సాధారణంగా మన పుట్టిన తేదీ ఆధారంగా లెక్కించి చెప్పే వాస్తవ వయస్సును కాలక్రమానుసార వయస్సు(క్రొనలాజికల్ ఏజ్)గా, ఎదుటి వారికి మనం కనిపించే వయస్సును జీవసంబంధ (బయలాజికల్ ఏజ్) వయస్సుగా పిలవడం జరుగుతుంది. ఈ విధంగా వ్యక్తి వాస్తవ వయస్సు కన్న తక్కువ లేదా ఎక్కువ వయస్సు ఉన్నట్లు కనిపించడం సర్వసాధారణం. కొందరు వాస్తవ వయస్సు కన్న యవ్వనంగా, మరి కొందరు అసలు వయస్సు కన్న వృద్ధులుగా కనిపిస్తారు. జన్మ తేదీ ఆధారంగా వాస్తవ కాలక్రమానుసార వయస్సు ఆధారపడితే, బయలాజికల్ ఏజ్‌ని మాత్రం జన్యు మార్పులు (డియన్‌ఏ మిథైలేషన్), వ్యక్తి జీవనశైలిని బట్టి ఆధారపడి ఉంటుంది.

**అంతర్జాతీయ వయోవృద్ధుల దినం-2023:**

1990లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 01 అక్టోబర్‌న అంతర్జాతీయ వయోవృద్ధుల దినం పాటించుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ వయోవృద్ధుల దినం-2023 నినాదంగా "తరాల అంతరాలు లేకుండా వయోవృద్ధుల హక్కులను కాపాడుదాం" అనే అంశాన్ని తీసుకోని ప్రచారం చేస్తున్నారు. వృద్ధుల పట్ల డిజిటల్ తరం చూపిస్తున్న నిర్లక్ష్యం ధోరిణిని పరిగణలోకి తీసుకొని, వయోవృద్ధుల సమస్యలను చర్చించడానికి ఈ వేదికలు ఉపయోగపడతాయి. నిన్నటి యోధులైన నేటి వృద్ధులను గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవలసిన కనీస బాధ్యత సంతానం, కుటుంబ సభ్యులు, ఇతర సంబంధిత వ్యక్తులు, పౌర సమాజం మీద ఉందని గమనించాలి. 2022 వివరాల ప్రకారం, 65 ఏండ్లు దాటిన ప్రపంచ వయోవృద్ధుల జనాభా 77 కోట్లు ఉండగా, భారతంలో 60 ఏండ్ల వయస్సు దాటిన జనాభా దాదాపు 15 కోట్లు ఉన్నది. 2050 నాటికి ప్రపంచ వృద్ధుల జనాభా 16 శాతానికి చేరవచ్చని అంచనా వేస్తున్నారు. వైద్య ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి రావడం, ఆహార భద్రతలో ముందడుగు పడడం, పేదరికం క్రమంగా తగ్గడంతో ప్రపంచవ్యాప్తంగా సగటు ఆయుర్దాయం(ప్రపంచ సగటు ఆయుర్దాయం 72.81 ఏండ్లు, భారత్‌లో 70.42 ఏండ్లు), వృద్ధుల జనాభా క్రమంగా పెరుగుతోందని అర్థం చేసుకోవాలి.

**వృద్ధాప్యంలో రకాలు:**

ప్రతి ఒక్కరు తమ వాస్తవ వయస్సు కన్న యవ్వనంగా కనిపించడానికే ఇష్టపడతారు. మన జీవనయానంలో శరీర అంతర్భాగాలు ఏ పరిమాణంలో డామేజ్ అయ్యాయనే విషయాలను బట్టి మన బయలాజికల్ వయస్సు ఆధారపడి ఉంటుంది. వృద్ధాప్యం మూడు రకాలుగా కనిపిస్తుంది. బయలాజికల్ ఏజింగ్ (శరీర కదలికలు/అవయవ నిర్మాణ ఆధారంగా కనిపించే వయస్సు), మానసిక వృద్ధాప్యం (సైకలాజికల్ ఏజింగ్), సామాజిక వృద్ధాప్యం (సోషల్ ఏజింగ్) అనబడే ఏజింగ్ ప్రక్రియలు ఉన్నాయి. వయస్సు, ఎత్తుకు సరితూగే శరీర బరువు కలిగి ఉండడం, నిత్యం శారీరక వ్యాయామం చేయడం, తరుచుగా వైద్య పరీక్షలు చేసుకుంటూ ఆరోగ్య సూత్రాలను పాటించడం, పండ్లు/కూరగాయలు/ఆకుకూరలు అధికంగా తీసుకోవడం, వృత్తి ఉద్యోగ ఒత్తిడిని తగ్గించుకోవడం, సమతుల జీవనశైలిని పాటించడం, రోజుకు 7 - 8 గంటలు నిద్ర పోవడం లాంటి మంచి అలవాట్లు కలిగిన వారు తక్కువ వయస్సు ఉన్నట్లు కనిపిస్తారు. మెదడులో వచ్చే సహజ మార్పులు, శారీరక చురుకుదనం, మానవ సంబంధాలు, భావోద్వేగాల నియంత్రణలు, ప్రవర్తనలను బట్టి సైకలాజికల్ ఏజింగ్ మారుతుంది. మంచి ఆహారాన్ని తీసుకోవడంతో మెదడు చురుకుదనం పెరుగుతుంది. శారీరక మానసిక ఒత్తిడికి లొంగినపుడు వ్యక్తి అసలు వయస్సు కన్న ఎక్కువగా కనిపిస్తాడు. సామాజిక అలవాట్లు, ప్రవర్తనలో మార్పులు, ఆరోగ్యకర మానవ సంబంధాల నెట్‌వర్క్, ఎల్లవేళల పనిని కల్పించుకొని ఇష్టపడి చేయడం, పరిసరాల పరిశుభ్రత లాంటివి సోషల్ ఏజింగ్‌ను ప్రభావితం చేస్తాయి.

**యవ్వనంగా కనిపించడం ఎలా ?**

పుట్టిన తేదీని బట్టి క్రానలాజికల్ ఏజ్‌ను కచ్చితంగా ఏండ్లు, నెలలు, రోజులు, గంటలు, నిమిషాల్లో నిర్ణయించవచ్చు. జీవయాత్రలో శరీర అవయవాలు, చర్మం, ఇతర అవయవ కణజాలాలకు జరిగి నష్టాలను బట్టి బయలాజికల్ ఏజ్ కనిపిస్తుంది. మన శరీరంలోని జన్యువుల్లో మార్పులు, జీవనశైలి, పోషకాహారం, వ్యాధులు లాంటి కారణాలతో బయలాజికల్ ఏజ్ మారుతుంది. మన నిజ వయస్సు కన్న యవ్వనంగా కనిపించడానికి సరైన శారీరక వ్యాయామం చేయుట ద్వారా బిపి, షుగర్, గుండె జబ్బులు, కీళ్ళ నొప్పులకు దూరంగా ఉంటూ యవ్వనంగా కనిపించుట జరుగుతుంది. అధిక బరువు లేదా స్థూలకాయ సమస్యలతో సతమతమయ్యే వారి బయలాజికల్ ఏజ్ ఎక్కువగా కనిపిస్తుంది. పండ్లు, చిక్కుడు గింజలు, అధిక పీచు కలిగిన పదార్థాలు, అల్ప కొవ్వుల ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలను అధికంగా తీసుకుంటూ తమ వయస్సు కన్న యవ్వనంగా కనిపించేలా ప్రయత్నం చేయాలి. పాస్ట్ పుడ్స్, జంక్ పుడ్స్, సోడా ద్రావణాలు, బేకరీ పదార్థాలు లాంటివి అధికంగా వినియోగించే వారికి వృద్ధాప్యం తొందరగా వస్తుందని అంటున్నారు. జీవితకాలం (లైఫ్‌స్పాన్), ఆరోగ్యకాలం (హెల్త్‌స్పాన్) వేరు వేరు అంశాలుగా భావించాలి. క్రానలాజికల్ వయస్సు పెరిగితే సగటు జీవితకాలం కూడా పెరిగి ఆరోగ్యకర సమాజాన్ని సూచిస్తుంది. ఆరోగ్యకాలం పెరిగితే సమాజంలో ఆరోగ్యం నెలకొని అసలు వయస్సు కన్న యవ్వనంగా కనిపిస్తారు.

**ఆనందంతో జీవించే కళను నేర్చుకుందాం:**

మన వయస్సు కన్న చురుకుగా, చర్మ మెరుపులను కలిగి సక్రమమైన జీవనశైలిని అవలంబిస్తూ, సంపూర్ణ ఆరోగ్యంతో వాస్తవ వయస్సు కన్న యవ్వనంగా కనుపించడానికి ప్రయత్నం చేద్దాం, మనం ఎదుగుతూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం తీసుకుందాం. వయస్సు శరీరానికే అని, మనసుకు కాదని రుజువు చేద్దాం. వాస్తవ వయస్సు అంకెలు మాత్రమే అని, మానసిక ఉత్సాహంతో యవ్వనులుగా జీవించడం ఓ కళ అని తెలుసుకుందాం, మన అసలు వయస్సు కన్న యవ్వనంగా చురుకుదనంతో కదులుతూ జీవితాన్ని పూర్తిగా ఆస్వాదిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# అక్టోబర్ 3న రాష్ట్రంలో పర్యటించనున్న కేంద్ర ఎన్నికల సంఘం



హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అక్టోబర్ 3వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు అన్ని వివరాలతో సిద్ధంగా ఉండాలని సీఎస్ శాంతి కుమారి ఆదేశించారు. ఈసీ అధికారుల రాష్ట్ర పర్యటనకు సంబంధించి చేసిన ఏర్పాట్లపై శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన ఇతర సభ్యులు వచ్చే నెల 3 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఈసీ సభ్యులు తమ మూడు రోజుల పర్యటనలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు/సీపీలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తారని సీఎస్ అధికారులకు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున ఎన్నికలకు సంబంధించిన అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని, అధికారులు అన్ని వివరాలను ఒకే పద్ధతిలో అందించాలని ఆమె అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల వివరాలను అందించాలని, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్లతో చర్చించి వీల్ చైర్‌లు కొనుగోలు చేసి పోలింగ్ కేంద్రాల వద్ద ఉంచాలన్నారు. ఏఈఆర్ఓ/ఈఆర్ఓల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, సమీకృత సరిహద్దు చెక్‌పోస్టుల వివరాలను కూడా ఈసీ అధికారులకు అందుబాటులో ఉంచాలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో సీఈవో వికాస్ రాజ్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హోం శాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, విద్యాశాఖ కార్యదర్శి వీ కరుణ, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి భారతి హోళికేరి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎలక్టోరల్ బాండ్లను జారీ చేయడం చట్టపరమైన లంచం

### -బీజేపీ సర్కార్‌కు ఇది బంగారు పంటగా మారుతుంది
### -కాంగ్రెస్ నేత చిదరంబరం విమర్శ



న్యూఢిల్లీ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ ) ఎలక్టోరల్ బాండ్ల ను జారీ చేయడం చట్టపరమైన లంచం అని కాంగ్రెస్ నేత చిదరంబరం ఆరోపించారు. అక్టోబర్ 4వ తేదీ నుంచి పది రోజుల పాటు ఎలక్టోరల్ బాండ్లను ఓపెన్ చేస్తున్నట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత చిదంబరం ఆ ఆరోపణలు చేశారు. బీజేపీ సర్కార్‌కు ఇది బంగారు పంటగా మారుతుందని ఆయన విమర్శించారు. 28వ సారి ఎలక్టోరల్ బాండ్లను అనుమతి ఇస్తూ కేంద్ర సర్కారు శుక్రవారం ప్రకటన జారీ చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన అన్ని బ్రాంచిలలో అక్టోబర్ 4 నుంచి 13న వరకు 28వ విడత ఎలక్టోరల్ బాండ్లను విక్రయించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగను న్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ఎలక్టోరల్ బాండ్లను విక్రయించనున్నట్లు తెలిపింది. గత రికార్డులను దృష్టిలో పెట్టుకుంటే, ఆ బాండ్లలో 90 శాతం వరకు బీజేపీకి వెళ్లనున్నట్లు కాంగ్రెస్ నేత చిదంబరం ఆరోపించారు. ఆశ్రిత పెట్టుబడిదారులు తమ చెక్ బుక్‌లను ఓపెన్ చేసి ఢిల్లీలో ఉన్న తమ మాస్టర్ కోసం సంతకాలు చేస్తారని పేర్కొన్నారు. ఎలక్టోరల్ బాండ్లను లీగల్ బ్రైబరీగా ఆయన విమర్శించారు. పొలిటికల్ ఫండింగ్‌లో పారదర్శకత కోసం నేరుగా నగదు విరాళాలు కాకుండా దానికి ప్రత్యామ్నాయంగా ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టారు. మార్చి 2018లో తొలి సారి ఎలక్టోరల్ బాండ్లను విక్రయించడం మొదలుపెట్టారు. కేవలం స్టేట్ బ్యాంక్ ఇండియాలో మాత్రమే ఆ బాండ్లను విక్రయిస్తారు.

# తిరుమలలో భక్త జన సముద్రం- ఐదు కిలోమీటర్ల మేర విస్తరించిన క్యూ లైన్లు

తిరుపతి, సెప్టెంబర్ 30: పవిత్రమైన పెరటాసి మాసంలో రెండవ శనివారంతో పాటు అక్టోబర్ 2వ తేదీ వరకు వరుస సెలవులు ఉండడంతో తిరుపతి, తిరుమలకు వెళ్లే రహదారులన్నీ భక్తులతో నిండిపోయాయి. అలిపిరి వద్ద వున్న పార్కింగ్ ప్రాంతాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. అలిపిరి నుండి ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వరకు తమిళనాడు రాష్ట్రం నుండి వచ్చిన బస్సులతో నిలిచి ఉన్నాయి. శుక్రవారం నుంచి అలిపిరి రహదారికి ఇరువైపులా బస్సులు బారులు తీరాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1 మరియు 2, నారాయణగిరి షెడ్‌లలోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూ లైన్లు నందకం విశ్రాంతి భవనం దాటి ఐదు కిలోమీటర్లకు పైగా విస్తరించాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శనం, అన్నప్రసాదాలు, వసతి తదితర అంశాలపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించి విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టింది.

ఈవో ఎవి.ధర్మారెడ్డి ఆదేశాల మేరకు టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గురువారం నుండి క్యూ లైన్లలో వున్న భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, మజ్జిగ నిరంతరాయంగా టీటీడీ అందిస్తోంది. దాదాపు 2500 మంది శ్రీవారి సేవకులు నిరంతరాయంగా భక్తులకు సేవలు అందిస్తున్నారు. వైకుంఠం కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు, బయట క్యూ లైన్లు, లగేజీ కౌంటర్లు, లడ్డూ కౌంటర్లు, అన్నప్రసాదం, రిసెప్షన్, కల్యాణకట్ట, ఆలయంలోపల క్యూ లైన్ల నిర్వహణ, చెప్పుల్ స్టాండ్‌లు మొదలైన వాటి వద్ద వివిధ షిఫ్టుల్లో సేవలందిస్తున్నారు. వివిధ శాఖలు యాత్రికుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ వేచి ఉన్న యాత్రికులకు సౌకర్యాలు కల్పిస్తున్నాయి.

సెప్టెంబర్ 30వ తేదీ నాటికి శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి టోకెన్ లేని భక్తులకు దాదాపు 48 గంటల సమయం పడుతోంది. టీటీడీ రేడియో మరియు బ్రాడ్‌కాస్టింగ్ విభాగం ఈ విషయమై తెలుగు, తమిళం, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీష్ భాషలలో నిరంతరం ప్రకటనలు చేస్తోంది. దర్శనం కోసం ఎక్కువ సమయం వేచి ఉండవలసి వస్తోంది. దీంతో ఈ దర్శన సమయాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులు తమ తీర్థయాత్రను రూపొందించుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

# ప్రాంత భేదాలకు అతీతంగా ఇండ్ల కేటాయింపు

### -రంజిత్‌రెడ్డి, విప్, ఎమ్మెల్యే గాంధీ

హైదరాబాద్, సెప్టెంబర్ 30:కులం మతం ప్రాంతం



రాజకీయాలకు అతీతంగా పేదరికమే అర్హతగా డబుల్ ఇండ్ల కేటాయింపులు జరిగినట్లు విప్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. నిరుపేదల కండ్లలో సీఎం కేసీఆర్ డబుల్ ఆనందాన్ని నింపారని, లబ్ధిదారుల సంతోషానికి అవధుల్లేవన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మూడు విడతలుగా నిర్వహించిన డబుల్ ఇండ్ల డ్రా ద్వారా ఎంపికైన 2816 లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశం శుక్రవారం మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో నిర్వహించారు.

ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డిలతో కలిసి విప్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేద ప్రజల పక్షపాతియని, వారి సంక్షేమం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. నిరుపేదల సొంతింటి కలను నిజం చేసిన ఏకైక సమర్థత కలిగిన పాలకుడు సీఎం కేసీఆర్ అని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.

విప్ గాంధీ మాట్లాడుతూ నానాటికీ పెరుగుతున్న స్థలాల ధరల నేపథ్యంలో నిరుపేదలకు భారంగా మారిన సొంతింటి కలను సీఎం కేసీఆర్ రూపాయి ఖర్చు లేకుండా నిజం చేశారన్నారు.

నియోజకవర్గంలో మూడు విడతలలో 2816 మంది డబుల్ లబ్ధిదారుల ఎంపిక పూర్తయిందని, అక్టోబరు 2 , 5 తేదీలలో ఇండ్ల కేటాయింపు చేపడుతామని విప్ గాంధీ తెలిపారు.

మానవ ప్రమేయం ఏమాత్రం లేకుండా పూర్తి సాంకేతికతతో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టినట్లు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మానస పుత్రిక డబుల్ బెడ్ రూం పథకమని, డబుల్ ఇండ్ల ఆవాసాల వద్ద లక్షలాది రూపాయల నిధులను వెచ్చించి సకల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒక్క దరఖాస్తుతో లక్షల విలువైన సొంత ఇంటిని పేదలకు కానుకగా సీఎం కేసీఆర్ అందించారని, నియోజకవర్గ లబ్ధిదారుల తరపున విప్ గాంధీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ పథకమే కాకుండా గృహలక్ష్మి పథకం ద్వారా సొంతింటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని సైతం అందిస్తున్నట్లు విప్ గాంధీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అల్పాహారం అందించారు. స్వయంగా విప్ గాంధీ లబ్ధిదారులకు అల్పాహారాన్ని వడ్డించారు. లబ్ధిదారులతో కలిసి అల్పాహారాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, మాజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం..

### - గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పార్లమెంట్ ఆమోదం పొందిన ప్రతిష్ఠాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లు పై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేశారు. దాంతో బిల్లు చట్టం రూపం దాల్చినట్టయ్యింది. రాష్ట్రపతి ఆమోద ముద్ర పడగానే శుక్రవారం కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నూతన చట్టం ప్రకారం లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాల్సి టుంది. అంతకుముందు గురువారం రోజే భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఈ 128వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సంతకం చేశారు. అనంతరం రాజ్యాంగంలోని 111వ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. ఇవాళ రాష్ట్రపతి కూడా ఆమోద ముద్ర వేయడంతో బిల్లు చట్టరూపం దాల్చింది. మహిళ రిజర్వేషన్ బిల్లు కోసం కేంద్రం రెండు రోజుల పాటు పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చింది. లోకసభ, రాజ్యసభలో దాదాపు ఏకగ్రీవంగా ఈ బిల్లు ఆమోదం పొందింది. ఇప్పుడు రాష్ట్రపతి ఆమోదముద్ర కూడా పడటంతో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ దక్కనుంది.

# వైసీపీ నేతల ఆరోపణలు చూస్తుంటే పరమానందయ్య శిష్యులే నయం

అమరావతి సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఏపీ ఫైబర్ నెట్ ప్రాజెక్ట్‌పై వైసీపీ నేతలు మంత్రులు చేస్తున్న ఆరోపణలు చూస్తుంటే, వీళ్లకంటే పరమానందయ్య శిష్యులే నయమనిపిస్తోందని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు డూండీ రాకేశ్ వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. రూ.281 కోట్ల వ్యయమైన ప్రాజెక్ట్‌లో రూ.2 వేలకోట్ల అవినీతి జరిగిందనడం మతిలేని ఆరోపణ కాదా అని ప్రశ్నించారు. ఫైబర్ నెట్ ప్రాజెక్ట్‌లో లోకేశ్ కీలకంగా వ్యవహరించాడని.. అతని సంతకం ఉందంటున్న వారు.. అధికారుల సంతకాలపై ఎందుకు మాట్లాడరని నిలదీశారు. ప్రాజెక్ట్ విధివిధానాల్లో ప్రముఖ పాత్ర వహించిన అధికారులను విచారించకుండా... లోకేశ్ ది తప్పని ఎలా చెబుతారని అడిగారు. ప్రాజెక్ట్‌లో తప్పు జరిగితే వైసీపీ ప్రభుత్వంలో ఇంతకు ముందు విచారణ జరిపిన ఏపీ రెవెన్యూ ఇంటిలిజెన్స్ వ్యవస్థ ఎందుకు ఏమీ తేల్చలేదని ప్రశ్నించారు. సెట్ టాప్ బాక్సులు దెబ్బతిన్నాయని.. నాసిరకమైనవి అందించారంటున్న వారు.. ఆ బాక్సుల్ని సరఫరా చేసిన సంస్థకు ఎందుకు తిరిగి పంపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఐఎంసిసి జాతీయ అధ్యక్షులుగా పోకల కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నిక



చెన్నై సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ స్నెవ్ స్); ఐఎంసిసి జాతీయ అధ్యక్షులుగా పోకల కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయినారు. తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడు జిల్లా సత్య మంగళం లో జరిగిన అన్నీ రాష్ట్రాల ,జాతీయ స్థాయి ప్రతినిధుల కౌన్సిల్ మీటింగ్ లో నేషనల్ ప్రెసిడెంట్ గా అన్ని విధాల అర్హతలు కలిగిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన పోకల కిరణ్ కుమార్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. 24 సంవత్సరాల మాదిగ దండోరా ఉద్యమంలో స్వార్థం ఎరుగని కిరణ్ జాతి ఆత్మగౌరవం కోసం పడిన అనేక అవమానాలకు అనేక కేసులకు ,పోలీస్ దెబ్బలకు, జైల్ జీవితానికి,ఆర్థిక ఇబ్బందులు,అనారోగ్య పరిస్థితుల్లో కూడాజాతి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే పోరులో చావుకు ఎదురు నిలిచి, రొమ్ము చాచిన ధీరత్వానికి ఇచ్చిన గౌరవంగా, ఎవరికీ తలవంచని నిజాయితీ పరునిగా మాదిగ జాతిలో మేలిమి ముత్యములాగా, జాతి కోసం నిరంతరం వెలిగే కిరణం లా పోకల కిరణ్ వెలుగొందాడు. జాతీయస్థాయిలో నిలపడానికిపై లక్షణాలే కారణమని మునుముందు మాదిగ జాతిని రాజ్యాధికారం వైపు నడిపిస్తావని రాజకీయ పార్టీల గుండెల్లో భయం సృష్టిస్తావనే నమ్మకం మా అందరిలో ఉందని చెప్పడానికి గర్వపడుతున్నా మని వక్తలు పేర్కొన్నారు. భవిష్యత్తులో దక్షిణ భారతంలో ఉత్తర భారతాన మాదిగ మరియు చమార్ సమాజానికి ద్రోహం చేస్తున్న ద్రోహులను చరపట్టే కొదమసింహంలా పోరాడతావనే నమ్మకాన్ని వక్తలు వ్యక్తం చేసారు.

# అమెరికాలోని ఈశాన్య రాష్ట్రాలను ముంచెత్తిన భారీ వర్షాలు

## -పోటెత్తిన వరదతో పూర్తిగా నీట మునిగాయి సబ్‌వేలు అపార్ట్‌మెంట్లు

న్యూ డిల్లీ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అగ్రరాజ్యం అమెరికాలోని ఈశాన్య రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. వర్షం కారణంగా పోటెత్తిన వరదతో సబ్‌వేలు అపార్ట్‌మెంట్లు పూర్తిగా నీట మునిగాయి. ముఖ్యంగా ఈ వరదలతో ఆ దేశ ఆర్థిక రాజధాని న్యూయార్క్



నగరం అతలాకుతలమైంది. శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా కురిసిన కుండపోత వర్షానికి ప్రధాన రహదారులు, వీధులు నదులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోని భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఈ వరద విమానాశ్రయాల్లోకి పోటెత్తడంతో వాటిని అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. పలు రైళ్లను రద్దు చేశారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో న్యూయార్క్ గవర్నర్ ఖాతీ హోచల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. కుండపోతగా కురుస్తున్న వర్షాలకు వరద ఉద్ధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అక్కడి వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని నగర మేయర్ విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు.




# సిటీ బస్సుల్లో యూపీఐ సేవలు

హైదరాబాద్, సెప్టెంబర్ 30:నగరంలోని అన్ని రకాల సిటీ బస్సుల్లో యూపీఐ డిజిటల్ లావాదేవీల ద్వారా టికెట్ జారీ చేసే ప్రక్రియకు ఆర్టీసీ యాజమాన్యం శ్రీకారం చుట్టబోతున్నది. దీని వల్ల ప్రయాణికులతోపాటు ఆర్టీసీ కండక్టర్లకు కూడా ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, పైగా సిటీ బస్సుల్లో చిల్లర సమస్య తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు నగరంలో దాదాపు 2,500పైగా ఉన్న ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో యూపీఐ సేవల ద్వారా టికెట్ జారీ చేసే ప్రక్రియ ఉన్నది. అయితే ఇప్పటికే.. ఆర్టీసీకి సంబంధించిన జిల్లా సర్వీసు.. అంటే మెట్రో లగ్జరీ, ఏసీ బస్సుల్లో యూపీఐ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు.

అలాగే నగరంలోని ఎయిర్‌పోర్టుకు తిరిగే ఏసీ బస్సుల్లోనూ క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ జారీ చేస్తున్నారు. తాజాగా సిటీ బస్సుల్లో యూపీఐ డిజిటల్ లావాదేవీల ద్వారా టికెట్ జారీ చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం అన్ని బస్సుల్లో ఐ-టీమ్స్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇప్పటికే ఐ-టీమ్స్ యంత్రాలను పంపిణీ చేసే సంస్థతో ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ జోన్ అధికారులు తెలిపారు.

# మెట్రో రైల్ సాధనకు పోరాటాలు తీవ్రతరం

## -పాతనగర ప్రజలకు మోసం చేస్తే ఊరుకునేదిలేదు

## -పాతనగర మెట్రో రైల్ జేఏసీ నేతల హెచ్చరిక

హైదరాబాద్ సెప్టెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్ పాతనగర ప్రజలకు మోసం చేస్తే ఉరుకునేదిలేదని, మెట్రో రైల్ సాధనకు పోరాటాలు తీవ్రతరం చేస్తామని పాతనగర మెట్రో రైల్ జేఏసీ నేతలు బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇందులో భాగంగా అక్టోబర్ మొదటి వారంలో ప్రతిపాదిత ఫలక్ నుమా మెట్రో రైల్ డిపో వద్ద వేలాదిమందితో భారీ ధర్నా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. హైదరాబాద్, న్యూస్ సర్వీస్ సిండికేట్ హాల్ లో శనివారం జరిగిన విలేఖరుల సమావేశంలో పాతనగర మెట్రో రైల్ జేఏసీ నేతలు సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి. నరసింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, టీపీసీసీ కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జి ఉస్మాన్ బిన్ మొహమ్మద్ ఆల్ హాజరీ, టీపీసీసీ నాయకులు చార్మినార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె. వెంకటేష్, టిటిడిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెద్దోజు రవీంద్ర చారి, బిఆర్ఎస్ పాతనగర నాయకులు సయ్యిద్ సలీం, సిపిఐ పాతనగర సీనియర్ కాంగ్రెస్ నాయకులు మూసా ఖాసీం, హైదర్ జాఫ్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలో సగం జనాభా కలిగిఉన్న పాతబస్తీలో మెట్రో రైల్ విస్తరించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం వహించడం సిగ్గుచేటన్నారు. ఓల్డ్ సిటీ మెట్రో కనెక్టివిటీ విస్తరణను తక్షణమే ప్రారంభిస్తున్నామని సీఎం కెసిఆర్ అసెంబ్లీ లో హామీ ఇవ్వడం, రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 కోట్లు కేటాయించడం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చిన ఇప్పటివరకు ఎందుకు పనులు ప్రారంభించలేదని అయన ప్రశ్నించారు. పాతబస్తీ అభివృద్ధికి సహకరించని ఎంఐఎం ఒత్తడితో ఓల్డ్ సిటీ మెట్రో కనెక్టివిటీ పనులు ఆపితే




ప్రభుత్వానికి ప్రతిఘటన తప్పదని అయన హెచ్చరించారు. ఏంజిబిఎస్ నుంచి ఫలక్ నుమా వరకూ 5.5 కిలోమీటర్ల మెట్రో రైలు నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఈ.టి. నరసింహ డిమాండ్ చేసారు. ఉస్మాన్ బిన్ మొహమ్మద్ ఆల్ హాజరీ మాట్లాడుతూ పాతబస్తీని ఇస్తాంబుల్ నగరంగా మారుస్తామన్న మంత్రి కేటీర్, కనీసం పాతబస్తీలో మెట్రో రైల్ పనులను ప్రారంభించాక పోవడం సిగ్గుచేటన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీ లేకపోవడంతో పాతబస్తీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మెట్రో రైల్ విస్తరిస్తామని పాతబస్తీ ప్రజలకు బిఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి విస్మరిస్తోందని ఆరోపించారు. పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని అయన డిమాండ్ చేసారు. కె.వెంకటేష్ మాట్లాడుతూ పాతబస్తీకి చెందిన చాలా మంది ప్రజలు తమ జీవనోపాధి కోసం ప్రతిరోజూ దూర ప్రయాణాలు కొనసాగిస్తుంటారని, సరైన రవాణా సౌకర్యం లేక తీవ్ర రవాణా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఓల్డ్ సిటీ వరకు మెట్రో లైన్‌ను పొడిగించడంలో జాప్యానికి నిరసిస్తూ పాతనగర మెట్రో రైల్ జేఏసీ అనేక ఆందోళనలు నిర్వహించిన ప్రభుత్వంలో చలనం రాకపోవడం దుర్మార్గమన్నారు. పాతబస్తీలో మెట్రో రైల్ కోసం డిమాండ్ చేస్తూ నిరంతరం నిరసనలు కొనసాగిస్తామని కె. వెంకటేష్ హెచ్చరించారు. పెద్దోజు రవీంద్ర చారి మాట్లాడుతూ రోజూ దూర ప్రాంతాలకు వెళ్లే పాతబస్తీ వాసులకు మెట్రో రైలు ఎంతో ఊరటనిస్తుందని, నగరంలోని అన్ని ప్రాంతాల్లో మెట్రో పనులు పూర్తయ్యి ప్రయాణికులకు అందుబాటులో ఉండగా, పాతబస్తీలో మెట్రో రైలు పనుల ఊసే లేదని విమర్శించారు. పాత బస్తీ అభివృద్ధి దేవుడెరుగు అన్నట్టుగా బిఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పాతబస్తీ లో మెట్రో రైల్ ప్రాజెక్ట్ పనులను ప్రారంభించాలని అయన డిమాండ్ చేసారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు.. సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్, సెప్టెంబర్ 30:శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టమని, కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు తెలియజేశారు. శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మిలాద్ ఉన్ నబి పండుగ కోసం శుక్రవారం చేసే ర్యాలీకి కరీంనగర్ లోని మర్కజీ మిలాద్ కమిటీ అనుమతి కోరిందని, దాన్ని పరిశీలించిన సంబంధిత పోలీస్ అధికారులు నిర్దేశించిన రూట్ మ్యాప్ ప్రకారం పరిమితులతో కూడిన అనుమతి ఇచ్చామన్నారు. కానీ మిలాద్ ఉన్ నబి ర్యాలీలో పాల్గొన్న కొందరు యువకులు పోలీస్ శాఖ ఇచ్చిన రూట్ మ్యాప్ లో కాకుండా, అనుమతి పరిమితులని అతిక్రమించి ఒక గుంపుగా ఏర్పడి కరీంనగర్ పలు వీధుల్లో ర్యాలీగా తిరగటం జరిగిందన్నారు. అందులో భాగంగానే కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ఆఫీస్ వీధిలో కూడా ర్యాలీగా వెళ్ళటం జరిగిందన్నారు. ఈ సంఘటన గురించి బీజేపీ పార్టీకి చెందిన కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు కరీంనగర్ పోలీసులకు తమ పార్టీ ఆఫీసుపై దాడి జరిగిందని భాద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారన్నారు.

తక్షణమే స్పందించి విచారణ చేపట్టామని ఆ సంఘటన ప్రదేశంలో వున్న ప్రత్యక్ష సాక్షులని, సీసీ కెమెరాలను కూడా పరిశీలించామన్నారు. మిలాద్-ఉన్-నబి ర్యాలీకి చెందిన యువకులు కొంత మంది ఒక గుంపుగా ఆ వీధిలో మాత్రమే వెళ్లారని, ఎటువంటి దాడి చేసినట్లుగా విచారణలో ఇప్పటి వరకు ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. ఇచ్చిన రూట్ మ్యాప్ లో కాకుండా అనుమతి పరిమితులు అతిక్రమించి గుంపుగా ఏర్పడి ర్యాలీగా తిరిగిన 15మంది యువకులను గుర్తించి వారిపై కేసు నవెూదు చేసి వారిని అరెస్టు చేశామన్నారు. వారి వాహనాలను కూడా సీజ్ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. సంఘటన జరిగిందని తెలిసిన వెంటనే పోలీసులు బీజేపీ పార్టీ ఆఫీన్ వద్దకు చేరుకున్నారని, భాద్యులని గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపినా వినకుండా బీజేపీ ఆఫీసులో గల వ్యక్తులు, కార్యకర్తలు నిరసనగా, గుంపుగా ఏర్పడి చేతుల్లో కట్టెలు తీసుకుని రోడ్లపైకి వచ్చి ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే చర్యలకు పాల్పడ్డారన్నారు.

అక్కడున్న పోలీసు వారితో దురుసుగా ప్రవర్తించి వాగ్వివాదానికి దిగి పోలీస్ విధులకు ఆటకం కలిగించిన వారిని కూడా గుర్తించి భాద్యులపై చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిని కుడా గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కరీంనగర్ లోని అన్ని మతాలకు చెందిన ప్రజలు వారి వారి పండుగలను శాంతియుత వాతావరణంలో సోదర భావంతో జరుపుకోవాలని అన్నివర్గాల మత పెద్దలను పలుమార్లు సమావేశపరచి సూచించామన్నారు. ఏవైనా చిన్న చిన్న సంఘటనలు జరిగినా లేక ఏదైన వర్గానికి చెందిన వారికి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొనే చర్యలకు పాల్పడవద్దని పలుమార్లు తెలిపామన్నారు.

దీనికనుగుణంగానే కరీంనగర్ ప్రజలంతా అన్ని పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటున్నారన్నారు. ఈ సంప్రదాయాన్ని భవిష్యత్తులో కొనసాగించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై, చట్టాన్ని ఉల్లంఘించి వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో మత ఘర్షణలకు దారితీసే పోస్టులు పెట్టడం, దుష్ప్రచారాలు చేసే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని, ప్రజల శాంతి భద్రతలే ముఖ్యమని, వాటికి విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల చట్ట పరిధిలో చాలా కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : మంత్రి గంగుల



కరీంనగర్, సెప్టెంబర్ 30:దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగల కమలాకర్ అన్నారు. అంబేద్కర్ స్టేడియంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్, అలీం కో సహకారంతో నిర్వహించిన దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.42వేల విలువైన ఒక్కో సైకిల్‌ను 30 మంది దివ్యాంగులకు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వికలాంగులకు రూ.4వేల పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. రానున్న రోజుల్లో దివ్యాంగులకు మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ బీ గోపి, నగర మేయర్ వై సునీల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ వారాహి విజయయాత్రలో పాల్గొనండి

## - టిడిపి శ్రేణులకు బాలకృష్ణ పిలుపు



అమరావతి, సెప్టెంబర్ 30:జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి యాత్రకు టిడిపి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు టీడీపీ నేత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ. నంద్యాలలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో శనివారం టీడీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం బాలయ్య మీడియాతో మాట్లాడుతూ తప్పు చేయనప్పుడు దేవుడికైనా భయపడాల్సిన అవసరం లేదన్నారు. సీఎం జగన్ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని.. ఏ ఆధారాలు లేకుండా చంద్రబాబును అరెస్ట్ చేశారని బాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షతోనే చంద్రబాబుపై స్కిల్ కేసును పెట్టారని ఆయన ఆరోపించారు.

టీడీపీ, జనసేన కలిసి ముందుకు వెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు బాలయ్య తెలిపారు. దీనిలో భాగంగానే పవన్ కళ్యాణ్ రేపటి నుంచి చేపడుతున్న వారాహి నాలుగో దశ యాత్రకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు బాలకృష్ణ చెప్పారు. టీడీపీ కార్యకర్తలు, నేతలు పవన్ కల్యాణ్ వారాహి యాత్రలో పాల్గొంటారని స్పష్టం చేశారు. అలాగే చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా నారా భువనేశ్వరి నిరాహార దీక్ష చేపట్టబోతున్నారని బాలయ్య తెలిపారు. ఇవాల్టి నుంచి నాలుగు రోజుల పాటు వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# ముందస్తు ప్రణాళికతోనే ప్రశాంతంగా ఎన్నికలు

## -సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

## -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 30: రానున్న సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన అంశాలపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, దానికి అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రానున్న ఎన్నికల దృష్ట్యా సోషల్ మీడియా మీద ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు, సిబ్బంది తరచు క్షేత్ర స్థాయిలో గ్రామాలు పర్యటిస్తూ ప్రజలకు ఎన్నికల నియమావళి పైన అవగాహన కల్పించాలని అన్నారు.




ప్రధాన ఎన్నికల అధికారి షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే ఎన్నికల నియమావళి అందుబాటులోకి వస్తుందని, అధికారులంతా ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాల్సి ఉంటుందని, మొదటిసారి ఎన్నికల డ్యూటీ చేస్తున్నటువంటి అధికారులు మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ లో గల అంశాలపై, ఎన్నికల బందోబస్తు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, సిబ్బంది మోహరింపు, కేంద్ర బలగాలతో సమన్వయనీ తదితర అన్ని అంశాలపై పోలీసు అధికారులకు స్పష్టత ఉండాలి అన్నారు. దానికి అనుగుణంగా పోలీసు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

రాబోయే ఎన్నికలకు సంబంధించి పోలీస్ అధికారులకు ఎన్నికల నియమావళి పట్ల ఎటువంటి అవగాహనా రాహిత్యం లేకుండా, వారికి గల పలు సందేహాలను నివృత్తి చేసేందుకు శిక్షణ ఇవ్వడం జరిగిందని అని తెలిపారు.

ప్రతి ఎన్నికల్లో కొత్త సవాళ్లు ఎదురవుతాయని ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు వల్నరబుల్ పోలింగ్ ప్రాంతాలకు గుర్తింపు పట్ల స్పష్టత ఉండాలని, ఎన్నికల నిర్వహణలో పోలీస్ పాత్ర భద్రత దళాల మోహరింపు నామినేషన్ దాఖల నుండి ప్రచారం పోలింగ్ రోజు నిర్వహణ తదితర అంశాలపై చేపట్టే ప్రణాళికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద ఎలా శాంతి భద్రతను పర్యవేక్షించాలి, ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు చేపట్టవలసిన ప్రత్యేక చర్యలు, ప్రత్యేక బందోబస్తు పై సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని గత ఎన్నికల్లో అమలు చేసిన గుడ్ ప్రాక్టీస్ ను అమలు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ముందే ఈ విధంగా అయినా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం వల్ల ఎన్నికల నిర్వహణ మరింత సులభతరంగా ఉంటుందని అన్నారు. గత ఎన్నికల సంబంధిత నేరాల చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేసుకోవాలి. వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారిని సంబంధిత అధికారుల ముందు బైండోవర్ చేయాలి. ట్రబుల్ మంగర్స్ పై నిఘా ఉంచాలి వారిని పోలీస్ స్టేషన్ లకు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు.

సేన్సేసినల్ కేసులలో నిందితులు, కమ్యూనల్ ఆఫెండర్స్, గొడవలు సృష్టించే వారినిజ్ లా అండ్ ఆర్డర్ సమస్య కలింగించే వారిని గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. ఎంబీడబ్ల్యూఎస్ మిగిలిన వారిని కూడా గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎస్పీలు ఉదయ్ రెడ్డి, నాగేంద్రచరి, రవికుమార్, సిఐలు ఉపేందర్, సదన్ కుమార్, కరుణాకర్, కృష్ణకుమార్, రవీందర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ అనిల్ కుమార్, ఆర్ఐ యాదగిరి, ఎస్ఐలు ఏఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

